సాక్షి ప్రకాశం

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



అధికారం అండగా అడ్డగోలుగా కేసులు..!

అధికారం అండతో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. - 8లో..



మరోసారి బాలినేని ఫ్లెక్సీల చించివేత

జనసేన పార్టీలో చేరనున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ఫొటోతో ఉన్న ఫ్లెక్సీలను నగరంలో మరోసారి చించివేశారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 31.9/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

మాజీ ఎంపీ పార్వతమ్మ కన్నుమూత

- నేడు నెల్లూరులో అంత్యక్రియలు



మాగుంట పార్వతమ్మ, మాజీ ఎంపీ

ఒంగోలు సబర్బన్: మాజీ పార్లమెంట్ సభ్యురాలు మాగుంట పార్వతమ్మ (77) బుధవారం చెన్నైలో మృతి చెందారు. అనారోగ్య కారణాలతో చెన్నైలోని అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతూ ఉదయం 6.27 గంటలకు మరణించారు. మాగుంట పార్వతమ్మ దివంగత ఒంగోలు ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి సతీమణి. మాగుంట సుబ్బరామి రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున ఒంగోలు ఎంపీగా ఉండగా 1995 డిసెంబర్‌లో ఒంగోలులోని భాగ్యనగర్ మూడోలైన్‌లోని మాగుంట కార్యాలయంలో నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో మృత్యువాతపడ్డారు. దాంతో ఒంగోలు పార్లమెంట్‌కు ఉప ఎన్నికలను 1996 లో నిర్వహించారు. సుబ్బరామిరెడ్డి వారసురాలిగా రాజకీయ ఆరంగేట్రం చేసిన పార్వతమ్మ ఉప ఎన్నికల్లో ఒంగోలు ఎంపీగా విజయం సాధించారు. ఆ తరువాత 2004లో నెల్లూరు జిల్లా కావలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్వతమ్మ పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అనారోగ్యంతో చెన్నై అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పార్వతమ్మ మృతదేహాన్ని స్వగ్రామం నెల్లూరు నగరానికి తీసుకొచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. గురువారం పార్వతమ్మ మృతదేహానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఒంగోలు ఎంపీ మాగుంట కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

పట్టణంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు



విద్యుత్ కార్యాలయంలో స్మార్ట్ మీటరును పరిశీలిస్తున్న డీఈఈ షియానాయక్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ నాగేశ్వరరావు, డీఈఈ షియా నాయక్ తెలిపారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో బుధవారం మొదటి స్మార్ట్ మీటరును ఏర్పాటుచేసి మాట్లాడారు. తొలుత అన్నీ ప్రభుత్వ కార్యాలయాలకు సింగిల్‌ఫేజ్ స్మార్ట్‌మీటర్లను బిగిస్తామన్నారు. అందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, స్కూల్స్, హాస్టల్స్, వీధిలైట్లు, పబ్లిక్ వాటర్ స్కీమ్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నట్లు చెప్పారు. అనంతరం త్రీఫేజ్ స్మార్ట్ మీటర్లు వచ్చిన తరువాత వాటిని ఏర్పాటు చేస్తారని అన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ మీటరు రీడర్ల సర్వీసు వద్దకు వెళ్లకుండానే బిల్లు ఎంత వస్తుందో తెలుస్తుందని చెప్పారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రెవెన్యూలో బదిలీలు పూర్తి

- బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- డీటీ, ఆర్ఐ, వీఆర్ఓలతో పాటు ఇతర కేటగిరీల్లో భారీగా బదిలీలు

ఒంగోలు అర్బన్: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో రెవెన్యూ శాఖలో చేపట్టిన బదిలీల పర్వం దాదాపుగా పూర్తయింది. ఆ మేరకు బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బదిలీ ఉత్తర్వులను ఆయా ఉద్యోగులకు అందజేశారు. డిప్యూటీ తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)లతో పాటు వీఆర్ఓలు, సీనియర్ అసిస్టెంట్‌లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, టైపిస్ట్ పోస్టులకు సంబంధించి భారీగా బదిలీలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో ఆర్ఐలు 9 మంది, 40 మంది సీనియర్ అసిస్టెంట్‌లు, నలుగురు ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్లు, 8 మంది టైపిస్ట్‌లు, 37 మంది జూనియర్ అసిస్టెంట్‌లు బదిలీ అయ్యారు. వీరితో పాటు డిప్యూటీ తహశీల్దార్లు 86 మంది, వీఆర్ఓలు 455 మంది కూడా బదిలీ అయ్యారు.

మెప్పునకు కలరింగ్

ఒంగోలు నగరపాలక సంస్థలో అడ్డగోలు వ్యవహారమిది. ఎమ్మెల్యే ప్రాపకం కోసం ఒకరు..బదిలీ ఆపారన్న నజరాగా మరొకరు ప్రజల సొమ్ము దుబారాకు బరితెగించారు. జనార్దన్ మెప్పు కోసం రూ.లక్షల దుర్వినియోగానికి పాల్పడ్డారు. నాలుగు రోజుల ముందు పూర్తయిన పనులకు టెండర్లు పిలిచి నిబంధనలు తుంగలోకి తొక్కారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లే దారిలో నెమలి బొమ్మ ఏర్పాటు వివాదాస్పదం కావడంతో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా దీనిని ఏర్పాటు చేస్తున్నామంటూ ఏకంగా కలెక్టర్ అన్సారియాతో ప్రారంభింపజేయడం గమనార్హం.

- పూర్తి చేసిన పనికి టెండర్లు
- ఎమ్మెల్యే దామచర్ల ఇంటి ముందు అలంకరణకు ప్రజల సొమ్ము దుబారా
- ఎమ్మెల్యే మెప్పు కోసం నగర పాలక సంస్థ అధికారుల అత్యుత్సాహం
- నగర పాలక సంస్థలో ఒక డీఈ బదిలీ ఆపినందుకు నజరానా
- టెండర్ ప్రక్రియ పూర్తికాని పనుల ప్రారంభానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ఆరు రోజుల క్రితమే 'సాక్షి'లో 'పురివిప్పిన దుబారా' అంటూ కథనం
- స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా అంటూ కలరింగ్

ఒంగోలు సబర్బన్: ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రిమ్స్‌కు ఆనుకొని ఉన్న బీకే అపార్ట్‌మెంట్‌లోని ఒక ప్లాటులో నివాసం ఉంటున్నారు. ఆ అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా ట్రంకు రోడ్డుపై ఉన్న డివైడర్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని నగరపాలక సంస్థలో ఎమ్మెల్యే సిఫారసుతో బదిలీ ఆపుకున్న డీఈఈ పథక రచన చేశారు. అందుకు మేయర్ జీ.సుజాత కూడా వత్తాసు పలికారు. అనుకున్నదే తడవుగా కార్యాచరణ చేపట్టారు. వారం రోజుల కిందట బీకే అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా డివైడర్‌పై ఇనుముతో తయారు చేసిన నెమలి బొమ్మను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొద్దిపాటి డివైడర్‌ను స్టీల్ రేలింగ్‌తో పాటు ఇతర రంగులతో సుందరంగా అలంకరించే పనులను ఈ నెల 18వ తేదీన మొదలు పెట్టారు. 20వ తేదీ నాటికి పనులు పూర్తి చేశారు కూడా. ఆ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఎందుకు ఏర్పాటు చేస్తున్నారు అని ఆరా తీస్తే ఎమ్మెల్యే దామచర్ల నివాసం నుంచి బయటకు వెళ్లే సమయంలోనూ... ఇంటికి వచ్చే సమయంలోనూ ఆహ్లాదకరంగా ఉండేలా దీనిని ఏర్పాటు చేస్తున్నారని తెలిసింది. దీనిపై ఈ నెల 21వ తేదీన 'పురివిప్పిన దుబారా' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. కార్పొరేషన్ అధికారులు హడావుడిగా ఈ నెల 21వ తేదీన ఈ పనుల కోసం టెండరు పిలిచారు. ఇదేంటి పనులు ప్రారంభించి టెండరు పిలవటం ఏమిటనుకుంటున్నారా. అదేమరి టీడీపీనా...మజాకా..!

21వ తేదీన టెండరు పలిచిన అధికారులు 24వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు బిడ్ వేసేందుకు గడువుగా కూడా నిర్ణయించారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలిచిన అధికారులు నెమలితో పాటు సుందరీకరణ కోసం రూ.4,62,357 కేటాయించారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 4.15 నిమిషాలకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా వేసిన కాంట్రాక్టరును గుర్తించారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు కావడంతో... టెండరు ప్రక్రియలో ఆ వర్కు లెస్‌కు వేశారా...లేక ఎక్సెస్‌కు వేశారా అని మాత్రమే చూసుకోవచ్చు. ఆ తరువాత టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఎవరో తెలుసుకుని షెడ్యూల్ అప్పగించాలి. అనంతరం సదరు కాంట్రాక్టరు ఒంగోలు నగర పాలక సంస్థతో ఎన్ని రోజుల్లో పనులు పూర్తిచేయాలో ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రక్రియలు ఏవీ జరగకుండానే 'నెమలి' ప్రారంభోత్సవానికి రంగం సిద్ధం చేసేశారు. నెమలి బొమ్మకు ముసుగు తొడిగి దాని చుట్టూ స్టీల్ రేలింగ్‌తో పాటు ఇతర సుందరీకరణ పనులు, అలంకరణ కోసం మొక్కల పెంపకంలాంటి అలంకరణలు చేస్తూ వస్తున్నారు.

దుబారాకు 'స్వచ్ఛతా హీ సేవ' ముసుగు..

యథేచ్ఛగా ప్రజా సొమ్ము దుర్వినియోగం చేస్తున్న అధికారులు, నగర పాలక సంస్థ పాలకమండలి దానికి అందమైన స్వచ్ఛతా హీ సేవా ముసుగు తొడిగింది. ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 2 జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వరకు 'స్వచ్ఛతా హీ సేవ' పక్షోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'చెత్త నుంచి కళలు (వేస్ట్ టూ ఆర్ట్)'లో భాగంగా ఈ నెమలి బొమ్మను తయారు చేసి రోడ్డుపై ఏర్పాటు చేశామని అధికారులు కలరింగ్ ఇస్తున్నారు. ఏర్పాటు చేసింది ఎమ్మెల్యే దామచర్ల నివాసం ఎదురుగా. కాపీ వర్కులో పేరు మాత్రం డీ-మార్ట్ ఎదురుగా... రామ్ నగర్ 8 వ లైన్ ఎంట్రన్స్ పేరుతో వర్క్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఎక్కడైనా సుందరీకరణ పనులు నాలుగు రోడ్ల కూడళ్లలో ఏర్పాటు చేస్తారు. అలాంటిది ఒంగోలు నగర పాలక సంస్థ మాత్రం విడ్డూరంగా ఒంగోలు ఎమ్మెల్యే ఇంటి ముందు పనులు చేపట్టి ప్రజల నుంచి వసూలు చేసిన పన్నును దుబారా చేస్తారా అంటూ మండిపడుతున్నారు.



బీకే అపార్ట్‌మెంట్ ఎదురుగా ఏర్పాటు చేసిన నెమలి బొమ్మ (ఈ అపార్ట్‌మెంట్‌లోనే దామచర్ల నివాసం ఉండేది)

ప్రారంభోత్సవానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా..

పనుల మంజూరు, టెండరు ప్రక్రియ ఇవన్నీ ఒక తప్పుల తడక అయితే...అడ్డగోలుగా చేసిన పని ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే దామచర్లతో పాటు, కలెక్టర్ పాల్గొనడంతో అందరూ ఆశ్చర్య పోతున్నారు. అధికార పార్టీ నాయకుల మెప్పు పొందేందుకు ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు ఒక మాయాజాలాన్ని సృష్టిస్తే కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరు కావటంపైనే తీవ్రంగా ఒంగోలు నగరంలో చర్చ జరుగుతోంది. కలెక్టర్ స్థాయి అధికారి ఇవేమీ తెలియకుండానే శంకుస్థాపన చేయాల్సిన పనిని పూర్తయి ప్రారంభోత్సవం చేస్తే ఏ విధంగా వెళతారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు కలెక్టర్‌కు కూడా వాస్తవాలు చెప్పకుండా ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేస్తున్న కార్యక్రమానికి ఆహ్వానించారా అని అనుకుంటున్నారు.



నెమలి బొమ్మను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ

- కక్ష సాధింపు చర్యలే అంటున్న పేద రైతులు



విచారిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ

తర్లుపాడు: అసైన్డ్ భూములపై వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ హయాంలో యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) పొందిన రైతన్నలపై కూటమి సర్కారు కక్ష సాధింపు చర్యలను దిగింది. ఇందులో భాగంగా అక్రమాలు జరిగాయంటూ ఫ్రీ హోల్డ్ చేసిన భూములను రీ ఎంక్వైరీ చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది. 3 నెలల పాటు లావాదేవీలు కూడా నిలిపివేసింది. ఈ నేపథ్యంలో మండలంలో ఫ్రీ హోల్డ్ చేసిన భూములను జిల్లా పౌరసరఫరాల మేనేజర్, ఒంగోలు స్పెషల్ ఆఫీసరు ఎంవీ సత్యనారాయణ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విచారించారు. తహశీల్దార్, మండలంలోని వీఆర్ఓ, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా ఫ్రీ హోల్డ్ చేసిన భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటి రికార్డులను తనిఖీ చేశారు. మండలంలోని 3302 మంది లబ్ధిదారులకు చెందిన 5227 ఎకరాల అసైన్‌మెంటు భూమిని ఫ్రీ హోల్డ్ చేసినట్లు గుర్తించారు. వీటిలో 33 కొనుగోలు, 54 గిఫ్ట్ డీడ్ కింద, 7 మార్ట్‌గేజ్ కింద లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు స్పెషల్ ఆఫీసర్ తెలిపారు. రీ వెరిఫికేషన్ పేరుతో పేద, వెనుకబడిన వర్గాల సన్నకారు రైతులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా ఆత్యాపాత్యా అండర్ 14 సెలక్షన్స్ రేపు

ఒంగోలు: జిల్లా స్థాయి అండర్ 14 ఆత్యాపాత్యా క్రీడాజట్ల ఎంపిక ఈనెల 27న స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సాయంత్రం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆత్యాపాత్యా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నంబూరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన బాల బాలికల జట్లు అక్టోబరు 5న నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు సెల్:6303000141ను సంప్రదించాలన్నారు.

జెడ్పీ బదిలీల్లో టీడీపీ వీరంగం

- జిల్లా పరిషత్ కార్యాలయంలో టీడీపీ నేతల హల్‌చల్
- సిఫారసు చేసిన వారికి చెప్పిన చోట పోస్టింగ్ ఇవ్వాలంటూ బెదిరింపులు
- బూతులతో రెచ్చిపోయిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి అనుచరుడు
- జెడ్పీ చైర్‌పర్సన్ పీఏ పై దుర్భాషలు
- కొలిక్కిరాని బదిలీల ఉత్తర్వులు

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం పరిధిలో జిల్లా పరిషత్ ఉద్యోగుల బదిలీల్లో అధికార పార్టీ నేతలు అధికారులపై బెదిరింపులకు దిగుతున్నారు. ''మేం చెప్పినట్టే అధికారులు నడవాలి..మేము చెప్పిన చోటే పోస్టింగ్‌లు ఇవ్వాలంటూ'' హుకుం జారీ చేస్తున్నారు. అధికారులను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషణలకు దిగుతూ వీరంగం సృష్టిస్తున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సంఘటన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో మొత్తం 392 మందికి సాధారణ బదిలీలు చేయాల్సి ఉంది. అందులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ 28 మంది, సీనియర్ అసిస్టెంట్లు 52 మంది, జూనియర్ అసిస్టెంట్లు 114 మంది, రికార్డు అసిస్టెంట్లు 100 మంది, టైపిస్టులు 24 మంది, అటెండర్లు 59 మంది, ఎంపీడీఓ లు 15 మంది చొప్పున మొత్తం 392 మంది ఉన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ జెడ్పీ ఉద్యోగుల సాధారణ బదిలీలకు సంబంధించి 21వ తేదీ సంతకం చేసి అప్రూవల్ ఇచ్చారు. 'మేము సిఫార్సు లేఖలు ఇచ్చిన వారికే.. చెప్పిన చోటే పోస్టింగులు ఇవ్వాలి' అంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు జెడ్పీ ఉన్నధికారులకు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తుండటంతో సాధారణ బదిలీల ప్రక్రియ కాస్తా నిలిచిపోయింది. మూడు రోజులుగా మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యే పీఏలు జిల్లా పరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. డిప్యూటీ సీఈఓ హనుమంతరావుతో మంతనాలు జరుపుతూనే ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి భర్త కడియాల లలిత్ సాగర్, ఆమె ముఖ్య అనుచరుడు ఆలోకం సురేష్, ఒక దినపత్రిక విలేకరి గొట్టిపాటి నాగేశ్వరరావు, మరికొంత మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు జెడ్పీ కార్యాలయానికి వచ్చారు. లలిత్ సాగర్, మరికొంత మంది ఒక గదిలో కూర్చున్నారు. సురేష్, విలేకరి నాగేశ్వరరావు, తదితరులు అధికారులపై దురుసుగా 'మేము లెటర్ ఇచ్చాం.. మేము చెప్పిన చోట పోస్టింగ్ ఇవ్వలేదు అంటూ విరుచుకుపడ్డారు. జెడ్పీ చైర్‌పర్సన్ పీఏపై బూతులు తిడుతూ దుర్భాషలాడారు. కార్యాలయంలో భయానక వాతావరణాన్ని సృష్టించారు. 'ప్రభుత్వం మారింది..ఇది టీడీపీ ప్రభుత్వం.. ఒళ్లు బలిసిందా ' అంటూ తిట్లు పురాణం మొదలు పెట్టి వీరంగం సృష్టించారు. 'మేం చెప్పిన చోట కూడా మా మాట వినకుండా మీ పెత్తనం ఏంటి.. మీరు చెప్పినట్లు మేము వినడం ఏంటి' అంటూ బెదిరింపులకు దిగారు. దీంతో కార్యాలయంలో గందరగోళ వాతావరణం నెలకొంది. అక్కడే ఉన్న సిబ్బంది, అధికారులు ఆందోళనకు లోనయ్యారు. ఇదిలా ఉండగా డిప్యూటీ సీఈఓ హనుమంతరావు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఉద్యోగులను పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీలకు సంబంధించి 21వ తేదీ సంతకం చేసి అప్రూవల్ ఇచ్చారు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ. అధికారులు 22వ తేదీ ఉత్తర్వులు ఇచ్చినట్లయితే 23వ తేదీన బదిలీ అయిన అధికారులు, సిబ్బంది విధుల్లో చేరి ఉండేవారు. అధికార పార్టీ నేతల పుణ్యమా అని గత మూడు రోజులుగా బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది.



జెడ్పీ చైర్‌పర్సన్ పీఏ ను దుర్భాషలాడుతున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి అనుచరుడు సురేష్

ప్రజారంజక పాలన అందించడమే లక్ష్యం



జెడ్పీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: ప్రజల సమస్యలు పరిష్కరించడం ద్వారా ప్రజారంజకపాలన అందించడమే తమ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి మూడు సంవత్సరాలు పూర్తిచేసి నాలుగవ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జెడ్పీటీసీ సభ్యులు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కుటుంబం విలువలకు కట్టుబడి ఉంటుందన్నారు. ప్రజలకు సేవ చేయడంలో బూచేపల్లి కుటుంబం ముందుంటుందని చెప్పారు. జిల్లా ను అభివృద్ధి పథంలో నడిపించడంలో తమ వంతు సహాయ సహకారాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు జి.తిరపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వేమా శ్రీనివాసులు, జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు అభినందనలు తెలుపుతున్న జెడ్పీటీసీ సభ్యులు

తిరుమల లడ్డుపై సీఎం వ్యాఖ్యలు సరికాదు

- సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి
- నిరాధార ఆరోపణలు చేయవద్దు
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మార్కాపురం: తిరుమల లడ్డు తయారీ విధానంపై దేవస్థాన ప్రతిష్టను దెబ్బతీసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడటం సరికాదని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు అన్నారు. మార్కాపురంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేవస్థానంలో నెయ్యి నాణ్యతను పరీక్షించే పటిష్టమైన వ్యవస్థ తిరుమలలో ఎప్పటి నుంచో ఉందని అన్నారు. ఆ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం వల్లే చంద్రబాబునాయుడు గతంలో సీఎంగా పనిచేసిన కాలంలో 15 సార్లు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 18 సార్లు నెయ్యి నాణ్యత సక్రమంగా లేదని తిరస్కరించారని చెప్పారు. మీ ఆరోపణలు నిజమైతే సంబంధిత విభాగంలో పనిచేసే అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. మీరు ఏదైతే ఏఆర్ డెయిరీ సరఫరా చేసిన నెయ్యిలో జంతు సంబంధిత కొవ్వు కల్తీ చేశారని చెబుతున్నారో ఆ సంస్థ టీటీడీకి నెయ్యి సరఫరా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన జూన్ 12వ తేదీ నుంచి చేశారని అన్నారు. గతంలో ఎప్పుడూ ఈ సంస్థ టీటీడీకి నెయ్యి సరఫరా చేసినట్లు రికార్డులు లేవని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క గ్రాము నెయ్యి కూడా టీటీడీకి ఈ సంస్థ సరఫరా చేయలేదని చెప్పారు.

టీటీడీ ఈఓ చెప్పిన ప్రకారం జూలై 6న రెండు, జూలై 12న రెండు ట్యాంకర్లు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేవని, వాటిని వెనక్కి పంపామని ఆ నెయ్యి వాడలేదని చెప్పిన విషయాన్ని రాంబాబు గుర్తుచేశారు. అలాంటప్పుడు లడ్డు తయారీలో కల్తీ ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. సున్నితమైన అంశంపై ప్రజలు కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందాలన్న స్వార్థంతోనే పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేశారనే దుస్సాహసానికి ఒడిగట్టడం చంద్రబాబునాయుడుకు తగదన్నారు.

టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి భక్తిభావాలు కలవారని అన్నారు. వైవీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు గోపూజ చేయనిదే ఇంటి నుంచి బయటకు వెళ్లరని అన్నారు. అటువంటి భక్తి భావాలున్న కుటుంబంలో సోషల్ మీడియాలో ఆయన సతీమణి బైబిల్ పట్టుకుందనే చెడు ప్రచారం చేయడం మంచి సాంప్రదాయం కాదన్నారు. ఈ వివాదంపై దాగి ఉన్న కుట్రను వెలికితీసేందుకు మీ అధికారం కింద పనిచేసే ఐజీ స్థాయి అధికారితో కాకుండా సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి సంబంధిత బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

వైద్య విద్యార్థి కోసం కొనసాగుతున్న గాలింపు


మారేడుమిల్లి జలపాతం వద్ద గాలింపు చర్యలపై సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

మార్కాపురం: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో నివాసం ఉంటున్న చింతగుంట రవికుమార్ కుమారుడు హరదీప్ ఏలూరులోని ఆశ్రమ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఈ నెల 22వ తేదీ మిత్రులతో కలిసి అల్లూరి జిల్లా మారేడుమిల్లి జలపాతం వద్దకు వెళ్లాడు. అక్కడ వరద ప్రవాహం పెరిగి ఐదుగురు గల్లంతవగా, ఇద్దరు విద్యార్థినులు బయటపడ్డారు. మిగిలిన ముగ్గురిలో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు బయటపడగా, హరదీప్ జాడ బుధవారం సాయంత్రం వరకూ తెలియలేదు. దీంతో జలపాతం దగ్గరే తల్లిదండ్రులు, బంధుమిత్రులు వేచి చూస్తున్నారు. రంపచోడవరం ఏఎస్పీ జగదీష్, అటవీశాఖ డీఎఫ్ఓ భబిత, ఫైర్ సిబ్బంది డ్రోన్లు, గజ ఈతగాళ్ల సాయంతో గాలిస్తున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన పిల్లలు


తప్పిపోయిన పిల్లలను నాయనమ్మకు అప్పగిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: గత ఏడాది నవంబర్ నెలలో బాపట్లకు చెందిన ఇద్దరు బాలికలు తప్పిపోవడంతో వారిని ఒంగోలులోని బాలసదనంలో ఉంచారు. ఇటీవల వారి కుటుంబ సభ్యులను గుర్తించి బుధవారం ఒంగోలులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పిల్లలను వారి నాయనమ్మ, బంధువులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా అప్పగించారు. 9 నెలలుగా సామాజిక మాధ్యమాలు, పత్రికా ప్రకటనల ద్వారా అధికారులు ప్రయత్నించినా బాలికల కుటుంబ సభ్యుల ఆచూకీ లభించలేదు. దీంతో పిల్లలను తీసుకుని బాపట్ల జిల్లా ఈపూరుపాలెం, స్టువర్టుపురం ప్రాంతాలకు వెళ్లి వారి తల్లిదండ్రులు, బంధువులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. వారం రోజుల ప్రయత్నం తర్వాత ఎట్టకేలకు స్టువర్టుపురంలో నాయనమ్మ, ఇతర బంధువులను గుర్తించారు. బుధవారం కలెక్టర్ చేతుల మీదుగా పిల్లలను వారి బంధువులకు అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సరంక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నీలిమ, సుమనశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీలలో పనిచేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో పనిచేసేందుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు జిల్లా కో ఆర్డినేటర్ డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతర సిబ్బంది పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీచేయడం జరుగుతుందన్నారు. ఈ పోస్టులను కేవలం 2024–25 విద్యా సంవత్సరానికి మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా రూ.250 దరఖాస్తు రుసుం చెల్లించి అక్టోబర్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్/ఫిజికల్ దరఖాస్తులు స్వీకరించడం జరగదని, వయోపరిమితి ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు 18 నుంచి 42 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 5 సంవత్సరాలు మినహాయింపు ఉందన్నారు. మాజీ సైనిక ఉద్యోగులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాలు వయోపరిమితి సడలింపు ఉందన్నారు. సబ్జెక్టుల వారీగా, రోస్టర్ వారీగా పోస్టుల వివరాలు, గౌరవ వేతనం, విద్యార్హతల వివరాలను కూడా పైన సూచించిన వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని సూచించారు.

వీర గాథ.. ప్రాజెక్ట్ 4.0 పోటీలు నిర్వహించాలి

ఒంగోలు: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో వీర గాథ ప్రాజెక్ట్ 4.0లో భాగంగా విద్యార్థులను 4 కేటగిరీలుగా విభజించి పలు రకాల పోటీలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 3 నుంచి 5 తరగతుల విద్యార్థులను మొదటి కేటగిరీగా, 6 నుంచి 8 తరగతుల విద్యార్థులను రెండో కేటగిరీగా, 9 నుంచి 10 తరగతుల విద్యార్థులను మూడో కేటగిరీగా, 11 నుంచి 12 తరగతుల విద్యార్థులను నాలుగో కేటగిరీగా విభజించి కేటగిరీల వారీగా పద్యాలు, డ్రాయింగ్, పెయింటింగ్, మల్టీ మీడియా వంటి పోటీలను ఈ నెల 30వ తేదీలోగా పాఠశాల స్థాయిలో నిర్వహించాలని హెచ్ఎంలను ఆదేశించారు. విజేతల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని, ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు (1–2) వారి పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు తగిన సలహాలు, సూచనలు జారీ చేసి పోటీలు నిర్వహించేలా చూడాలని సూచించారు.

అధికారం అండగా అడ్డగోలుగా కేసులు..!

- నాగిరెడ్డిపాలెంలో వినాయక నిమజ్జనం పేరుతో గులాములు చల్లిన టీడీపీ కార్యకర్తలు
- ప్రశ్నించిన అత్తా, కోడళ్లను చితకబాదిన టీడీపీ కార్యకర్తలు
- వినాయక బొమ్మకు పొక్లెయిన్లు అడ్డుపెట్టారంటూ రివర్స్ కేసు
- టీడీపీ కార్యకర్తల ఫిర్యాదుతో 11 మందిపై కేసులు, పొక్లెయిన్లు సీజ్
- రెండు రోజులుగా ఎస్టీలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధింపులు


పొన్నలూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రసాద్, శీనమ్మ


పోలీస్‌స్టేషన్ ఆవరణలో అక్రమంగా సీజ్ చేసిన పొక్లెయిన్లు

పొన్నలూరు: అధికారం అండగా టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను టార్గెట్ చేస్తూ అక్రమంగా కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. మంత్రి స్వామి, టీడీపీ నేతలు రాజకీయ కక్ష సాధింపులకు దిగుతూ పోలీసుల సాయంతో భయాందోళనకు గురిచేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెం యానాది కాలనీకి చెందిన ఇండ్లా ప్రసాద్, శీనమ్మకు చెందిన బంధువులు సుమారుగా 30 కుటుంబాలు వారు ఏడాది క్రితం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమకు సంక్షేమ పథకాలు అందడంతో తమ కుటుంబాలకు మేలు జరిగిందని గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారు. దీంతో అదే కాలనీకి చెందిన టీడీపీ మహిళా కార్యకర్త, ఆమె భర్త, బంధువులు అప్పటి నుంచి ప్రసాద్, శీనమ్మ బంధువులపై గొడవలకు దిగుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రసాద్ కుటుంబసభ్యులపై టీడీపీ కార్యకర్తల ఆగడాలు ఎక్కువయ్యాయి. దీంతో ప్రసాద్ తన ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోగా , వీటిని కూడా టీడీపీ కార్యకర్తలు దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయకుండా సర్దిచెప్పి పంపించారు. ఈ నెల 14న రాత్రి కాలనీకి చెందిన టీడీపీ వారు తమ వినాయక బొమ్మ ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. దీంతో ప్రసాద్, శీనమ్మ బంధువులు కాలనీలో ఉంటే టీడీపీ కార్యకర్తలు కావాలనే గొడవలు దిగుతారని భావించి కాలనీలో ఉండకుండా ఊరులో జరుగుతున్న అన్నదాన కార్యక్రమం దగ్గరకు వెళ్లారు.

పసిబిడ్డ తల్లిపై దాడి..

ఇంతవరకు బాగానే ఉన్నా ఎస్టీ కాలనీలో టీడీపీ కార్యకర్తలు తమ వినాయక బొమ్మను ఊరేగిస్తున్న క్రమంలో పసిబిడ్డ తల్లి అయిన కొమరగిరి వరలక్ష్మిపై కావాలనే గులాములు చల్లారు. ఇది గమనించిన వరలక్ష్మి అత్త పద్మ పసిబిడ్డ తల్లిపై గులాములు చల్లడం మంచిది కాదని ప్రశ్నించింది. దీంతో టీడీపీ మహిళా కార్యకర్తలు వరలక్ష్మి, పద్మపై దాడి చేశారు. అనంతరం అన్నదానం దగ్గర నుంచి ఇళ్లకు వచ్చిన బంధువులకు వరలక్ష్మి, పద్మ తమపై జరిగిన దాడి గురించి చెప్పారు. దీంతో ప్రసాద్, శీనమ్మ దాడి చేసిన వారిని ప్రశ్నించారు. ప్రభుత్వం మాది..ఏమైనా చేస్తామంటూ వారు బెదిరించారు. ఇంతలో కాలనీకి చెందిన కొందరు ఇరువురికి సర్దిచెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

11 మందిపై కేసులు, రెండు పొక్లెయిన్లు సీజ్...

అయితే పార్టీ మారిన ప్రసాద్, శీనమ్మ బంధువులపై ఆగ్రహంతో ఉన్న గ్రామంలోని టీడీపీ నాయకులు ఎస్టీ కాలనీలోని టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టారు. ఇదే అదునుగా భావించిన టీడీపీ నాయకులు మంత్రి స్వామి అండదండలతో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. తమ వినాయక బొమ్మ నిమజ్జనం రోజున ప్రసాద్, శీనమ్మ వారి పొక్లెయిన్లతో వినాయక బొమ్మ ఊరేగింపు జరగకుండా అడ్డు పెట్టారంటూ ఎస్టీ కాలనీలోని టీడీపీ కార్యకర్తలతో తప్పుడు ఫిర్యాదు చేయించారు. దీంతో కనీసం విచారణ కూడా చేపట్టని పోలీసులు మంత్రి స్వామి ఫోన్‌చేసి చెప్పాడంటూ ఏ తప్పు చేయని 11 మంది యానాదులపై కేసులు నమోదు చేసి, రెండు రోజుల పాటు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సాయంత్రం వరకు అక్కడే కూర్చోనిబెట్టి సాయంత్రం ఇంటికి పంపారు.

న్యాయం చేయాలని వేడుకోలు...

తాము ఏ తప్పు చేయకపోయినా కావాలనే మాపై దాడిచేసి ప్రశ్నించినందుకు కేసులు బనాయించి, పొక్లెయిన్లను సీజ్ చేశారని యానాదులు వాపోయారు. వాస్తవంగా పొక్లెయిన్లు గ్రామంలో లేవని, పని నిమిత్తం వేరే గ్రామంలో ఉన్న వాటిని పోలీసులు పది రోజుల తరువాత 23న తీసుకొచ్చి సీజ్ చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. కూలీ పనులు చేసుకోని జీవించే మమ్మల్ని మంత్రి స్వామి, స్థానిక టీడీపీ నాయకులు చెప్పారంటూ రెండు రోజులకు ఒకసారి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురిచేస్తున్నారని ఎస్టీలు ఆరోపిస్తున్నారు.

రాజశేఖర్‌పై దాడి కేసులో నిందితులు అరెస్ట్

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కో ఆపరేటివ్ అకౌంట్ ఆఫీసర్ పోలిశెట్టి రాజశేఖర్‌పై దాడి కేసులో ఎట్టకేలకు ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బుధవారం వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ నెల 8వ తేదీ రాత్రి ఆఫీసు పని ముగించుకుని తన గదికి వెళ్తున్న సమయంలో స్థానిక అంబేడ్కర్ భవన్ సమీపంలోని సచివాలయం వద్ద దారి కాచి ఉన్న కొందరు దుండుగులు రాజశేఖర్ కళ్లలో కారం కొట్టి కర్రలతో దాడి చేసిన విషయం తెలిసిందే. గ్రూప్ వన్ ఆఫీసరైన రాజశేఖర్ మీద దాడి జరగడం రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. నిజాయితీపరుడైన అధికారిగా పేరున్న ఆయనను సొంత శాఖకు చెందిన కొందరు ఉద్యోగులతో చేతులు కలిపిన అధికార పార్టీ నాయకులే దాడి చేయించినట్లు ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నతాధికారులపై దాడులు జరుగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. దాడి చేసిన నిందితులు అధికార పార్టీకి చెందిన వారు కావడం వలనే తూతూ మంత్రంగా కేసులు పెట్టి పోలీసులు చేతులు దులుపుకున్నారని కొందరు విమర్శలు చేయడం తెలిసిందే. ఆ విమర్శలకు దిగివచ్చిన ప్రభుత్వం.. దాడి జరిగిన 20 రోజుల తర్వాత మేలుకుని ఆరుగురు నిందితులను పట్టుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే, ఇప్పటికైనా నిజాయితీగా విచారణ జరుగుతుందో లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా సహకార రంగంలో అవినీతికి పాల్పడిన కొందరు వ్యక్తులే ఈ దాడికి పాల్పడ్డారని, ప్రస్తుతం వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.


రూ.20 లక్షలతో ప్రత్యేకంగా అలంకరించిన విఘ్నేశ్వరుడు

ధన గణపతి

- రూ.20 లక్షల అలంకరణలో విఘ్నేశ్వరుడు

ఒంగోలు మెట్రో: ఒంగోలు నగరంలో గద్దలగుంట రాజాపానగల్ రోడ్డులో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రుల్లో భాగంగా విఘ్నేశ్వరుడిని బుధవారం రాత్రి రూ.20 లక్షలతో ప్రత్యేకంగా అలంకరించారు. కరెన్సీ నోట్లతో చేసిన అలంకరణ చూపరులను ఆకట్టుకుంది.

ఆస్పత్రి నిర్వహణపై మంత్రి అసంతృప్తి


ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేస్తున్న మంత్రి, కలెక్టర్

కొండపి (సింగరాయకొండ): రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి స్థానిక కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆస్పత్రిలోని ఓపీ గదులు, అత్యవసర సేవా విభాగం, ఎక్సరే, ఎన్టీఆర్ వైద్య సేవలు కౌంటర్, కాన్పులు, పిల్లల వార్డులను, మందుల స్టోరేజీ విభాగాలను, హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్వహణపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్వహణపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై రోగులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న గదులను ఒక క్రమ పద్ధతిలో వినియోగించుకుంటూ ఆసుపత్రి నిర్వహణ పటిష్టంగా నిర్వహించాలని అన్నారు. ఆర్డీఓ సుబ్బారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ వరలక్ష్మి, వైద్యులు, తహసీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి బాలినేని ఫ్లెక్సీల చించివేత




ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో బాలినేని ఫొటో వరకు చించివేసిన దృశ్యం

- ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- బాలినేనిని జనసేనలో చేర్చుకోవద్దంటూ తెలుగు యువత నిరసన ప్రదర్శన

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలో మరోసారి జనసేన పార్టీ ఏర్పాటు చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఫ్లెక్సీలను చించివేయడం కలకలం సృష్టించింది. గురువారం మంగళగిరిలో పవన్ కళ్యాణ్ సమక్షంలో బాలినేని జనసేన తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ పేరుతో నగరంలోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలలో ఇటీవల పవన్ కళ్యాణ్‌ను కలిసిన బాలినేని ఫొటోలను ముద్రించారు. అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోలను కూడా ముద్రించారు. అయితే బుధవారం ఈ ఫ్లెక్సీలలో కేవలం బాలినేని ఫొటో వరకు మాత్రమే చించివేశారు. నగరంలోని లాయరు పేట, కోర్టు సెంటర్, ఆర్టీసీ బస్టాండు సెంటర్‌లతో పాటు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని దుండగులు చించివేశారు. ఈ ఫ్లెక్సీలను ఎవరు చించివేశారన్న దానిపై నగరంలో రకరకాల చర్చలు జరుగుతున్నాయి. జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ అనుచరులు చించారని కొందరు, లేదు తెలుగుదేశం పార్టీ శ్రేణులే ఈ ఫ్లెక్సీలను చించారని మరికొందరు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ ఘటన కూటమిలోని ఇరుపార్టీల మధ్య క్రమంగా దూరం పెంచుతోంది. ఇదిలా ఉండగా నగరంలో వరుసగా ఫ్లెక్సీలను చించివేయడంపై బాలినేని స్పందించారు. నేరుగా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. రెండు రోజుల్లోగా సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను అరెస్టు చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు సమాచారం.

బాలినేనిని జనసేనలో చేర్చుకోవద్దు:

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని జనసేన పార్టీలో చేర్చుకోవద్దంటూ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించిన తెలుగు యువత నాయకులు చెవుల్లో పూలు పెట్టుకొని మీడియాతో మాట్లాడారు. బాలినేనిని పార్టీలో చేర్చుకోవద్దంటూ నినాదాలు చేశారు.

వై.పాలెం జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

ఒంగోలు అర్బన్: యర్రగొండపాలెం జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న హేమలతను బుధవారం సస్పెండ్ చేశారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పుష్పలత ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెపై నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలు రావడంతో జిల్లా రిజిస్ట్రార్‌తో కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణ చేయించారు. ఆ విచారణలో ప్రభుత్వ రికార్డుల్లో లేని సర్వే నంబర్ 557–3తో రిజిస్ట్రేషన్ చేసినట్లు నిర్ధారణ కావడంతో సదరు నివేదిక ఆధారంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బీసీ సంక్షేమ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- మంత్రికి వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఒంగోలు టౌన్: బీసీ హాస్టళ్ల సంక్షేమ శాఖ మార్కాపురం డివిజన్ అధికారి షేక్ జబ్బార్ విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని, ఆయనపై శాఖాపరమైన విచారణ జరిపించాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. బుధవారం టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో రాష్ట్ర సాంఘిక శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. జబ్బార్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు, హాస్టళ్ల వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అతని అవినీతి, అక్రమాలపై పలుమార్లు బీసీ సంక్షేమ అధికారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద ధర్నా కూడా చేసినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి బి.ఏడుకొండలు, విజయ్ తదితరులు ఉన్నారు.

పీటీసీ ప్రిన్సిపాల్‌గా రాధిక

ఒంగోలు టౌన్: ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జీఆర్ రాధికను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే నాన్ కేడర్ ఎస్పీ అయిన డాక్టర్ కేవీ శ్రీనివాసరావును పీటీసీ ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఆయన ఇక్కడ విదుల్లో చేరి నెల రోజులు కూడా కాలేదు. ఇంతలోనే ఆయనను బదిలీ చేసి ఆయన స్థానంలో రాధికను నియమించడం గమనార్హం.

ఉరేసుకుని బాలుడు ఆత్మహత్య

కనిగిరి రూరల్: మతిస్థిమితం లేని బాలుడు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పట్టణంలోని మాచవరంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బి. ప్రసాద్, సుశీల దంపతులకు ఇద్దరు పిల్లలు. వారిలో పెద్దవాడైన బత్తుల చందు మధు(14) మానసిక స్థితి బాగా ఉండదు. వీరు తెలంగాణాలో బేల్దారి పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. ఇటీవల వినాయక చవితి పండుగకు స్వగ్రామం వచ్చారు. అయితే తల్లి, మరో అబ్బాయి ఇద్దరు అమ్మమ్మ, తాతయ్యల దగ్గర మాచవరంలో ఉంటున్నారు. తండ్రి ప్రసాద్ ఇటీవల తిరిగి తెలంగాణకు పనికి వెళ్లాడు. బుధవారం బత్తుల చందు ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి పెదనాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డెక్కిన భవన నిర్మాణ కార్మికులు



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కనిగిరి రూరల్: కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితమని చెప్పి.. అసలు ఇసుక లేకుండా చేసి భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేశారని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక నాజ్ సెంటర్‌లో బుధవారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీసీ కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఇసుక రీచ్‌ల ద్వార నియోజకవర్గ, పట్టణ, మండల కేంద్రాల్లో ఇసుక డంపింగ్ పాయింట్లు పెట్టి ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులను సంక్షేమ బోర్డు ద్వారా ఆదుకోవాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చేతులు కట్టేసి.. నోట్లో గుడ్డలు కుక్కి..


సీతారావమ్మ


చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- ఒంగోలు కాకతీయనగర్‌లో వృద్ధురాలి ఇంట్లో దోపిడీ

ఒంగోలు టౌన్: నగరం నడిబొడ్డున ఉన్న కాకతీయనగర్‌లో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలిపై దొంగలు దాడికి పాల్పడి మరీ చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... కాకతీయనగర్ రెండో లైనులో పొన్నం సీతారావమ్మ అనే 80 సంవత్సరాల వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. ఆమె భర్త చనిపోయి చాలా సంవత్సరాలైంది. ఉన్న ఇద్దరు సంతానంలో కుమారుడు కమ్మపాలెంలో నివసిస్తుండగా, కుమార్తె కాకతీయనగర్‌లోనే మరో ఇంట్లో నివాసం ఉంటోంది. బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఇద్దరు దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. వారిని గమనించిన సీతారావమ్మ గట్టిగా కేకలు వేయడానికి ప్రయత్నించారు. అప్రమత్తమైన దొంగలు.. ఆమె మొహం మీద ముసుగు వేశారు. అయినా సరే సీతారావమ్మ ఏమాత్రం భయపడలేదు. ఎవర్రా మీరు.. ముసుగేస్తున్నారంటూ ధైర్యంగా తిరగబడ్డారు. విడిపించుకునేందుకు ప్రయత్నించారు. ఆమె కేకలు వేయకుండా నోట్లో గుడ్డలు కుక్కిన దొంగలు.. చేతులు కట్టేసి మొహం మీద పిడిగుద్దులు గుద్దారు. ఆ దెబ్బలకు ఆమె స్పృహ కోల్పోయారు. అనంతరం దొంగలు బీరువాలోని లక్ష రూపాయల నగదు, వృద్ధురాలి చెవులకు ఉన్న బంగారు కమ్మలు దోచుకుని వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత సీతారావమ్మ బయటకు వచ్చి ఎదురింటి వారిని నిద్రలేపి జరిగిన విషయాన్ని చెప్పారు. వెంటనే వారు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న ఒంగోలు టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దోపిడీ జరిగిన తీరును పరిశీలించారు. పోలీసు డాగ్‌ను రంగంలోకి దించి విచారణ చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిరాధార ఆరోపణలు సరికాదు

- చెన్నకేశవస్వామి ఆలయంలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం
- మాజీ ఛైర్మన్ కేశవరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేశవరావు

మార్కాపురం: స్థానిక శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని పాలకమండలి మాజీ ఛైర్మన్ పెనుగొండ అనంత సుబ్రహ్మణ్య కేశవరావు, సభ్యులు స్పష్టం చేశారు. ఆలయంలో నాలుగు రాజగోపురాల నిర్మాణం, గోదాదేవీ, బేరీ మండపం, ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఇత్తడి తొడుగు తదితర అభివృద్ధి పనుల్లో ఎలాంటి అవినీతి జరగలేదని వివరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి చేసిన ప్రతి ఖర్చుకు రసీదు ఉందన్నారు. దాతల సహకారంతోనే నాలుగు రాజగోపురాలను ఏడాది వ్యవధిలో పూర్తిచేశామని తెలిపారు. స్వామివారి సొమ్మును ఎక్కడా దుర్వినియోగం చేయలేదని స్పష్టం చేశారు. కొంతమంది వివిధ రకాలుగా ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. తాను ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అప్పటి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, పాలకమండలి సభ్యులు, దాతల సహకారంతో ఆలయంలో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ప్రభుత్వం మొత్తం రూ.11 కోట్ల ఖర్చుతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అందులో ప్రభుత్వ సీజీఎఫ్ కింద తాము కోటి రూపాయలు చెల్లిస్తే మొత్తం కలిపి 2 కోట్ల రూపాయలను ఇచ్చిందన్నారు. దాతల నుంచి రూ.6,39,08,052 వచ్చినట్లు తెలిపారు. కాంట్రాక్టర్‌కు రూ.4.96 కోట్లు, జీఎస్టీ కింద రూ.51 లక్షలు, నాలుగు గోపురాల సంప్రోక్షన, బ్రహ్మోత్సవాలు, హోమాలు, బాలాలయాలు, గోదాదేవీ కల్యాణం, తెప్పోత్సవం కింద రూ.57.29 లక్షలతో పాటు ఇతరత్రా అభివృద్ధి పనులకు ఖర్చుచేశామని వివరించారు. మొత్తంమీద 8 కోట్ల 28 లక్షల 99 వేల రూపాయలు ఖర్చుచేశామని చెప్పారు. ప్రతిదీ తమ వద్ద లెక్క ఉందని, ఎవరు వచ్చినా చూపుతామని అన్నారు. స్వామివారి సొమ్ము ఒక్కపైసా కూడా దుర్వినియోగం కాలేదని చెప్పారు. విలేకరుల సమావేశంలో పాలకమండలి మాజీ సభ్యులు గోపాలుని హరిహరరావు, పిన్నిక చక్రపాణి, రమేష్, సురేంద్ర, బచ్చు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.